క్లుప్తంగా

వైకుంఠపురంలో రేషన్ బియ్యం పట్టివేత

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి 4.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బంది దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. వీఆర్‌వో అమిర్నేని వెంకటకృష్ణ అందించిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు తహసీల్దార్ విజయశ్రీ తన సిబ్బందితో ఎస్సీ కాలనీకి చెందిన గంగోలు భాగ్యారావు ఇంటిపై దాడి చేసి నిల్వ ఉంచిన 4.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కాలనీలో రేషన్ డీలర్‌కు అప్పగించారు. అలాగే గంగోలు భాగ్యారావుపై కేసు నమోదు చేశారు.

నేలబావిలో పడి తాపీ మేస్త్రి మృతి

పెదకూరపాడు: నేలబావిలో పడి తాపీ మేస్త్రి మృతిచెందిన ఘటన మండలంలోని హుస్సేన్ నగరం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడుకు చెందిన పమిడిపల్లి సునీల్ (28) గతకొంతకాలంగా హుస్సేన్ నగర్ గ్రామంలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. గత శుక్రవారం నుంచి సునీల్ పెదకూరపాడులోని తల్లిదండ్రుల వద్ద, హుస్సేన్‌నగరంలోని భార్య వద్దకు వెళ్లకపోవడంతో భార్య, తల్లిదండ్రులు అనుమానంతో వెతుకుతుండగా సోమవారం రాత్రి హుస్సేన్‌నగరం బ్రాందీ షాపు సమీపంలో ఉన్న నేలబావిలో తేలుతుండటం గమనించారు. పమిడిపల్లి వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

పత్రికాస్వేచ్ఛ అణచివేతపై నిరసన

అమరావతి: బీజేపీ ప్రభుత్వం న్యూస్ క్లిక్ పత్రిక ఎడిటర్ రబీర్, అమిత్ చక్రవర్తిలను అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పాతలారీ ఆఫీస్ సెంటర్‌లో ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం అధ్యక్షుడు బి.సూరిబాబు మాట్లాడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యల్ని ప్రజాస్వామ్యవాదులు సామాజిక ఉద్యమ నాయకులు ఖండించాలన్నారు. పదకొండు నెలల పాటు ఢిల్లీలో రైతాంగం ఉద్యమాన్ని దేశ విదేశాల్లో ప్రచారం చేసినందుకు న్యూస్ క్లిక్ పత్రికను నిషేధించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నిందన్నారు. పత్రికా స్వేచ్ఛపై నిరంతరం దాడులు చేస్తున్న బీజేపీ ప్రభుత్వంలో జర్నలిస్టులకు, రచయితలకు, కవులకు అభ్యుదయవాదులకు, ప్రజాస్వామ్య వాదులకు స్వేచ్ఛ లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి దాడులను మానుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడకపోతే భవిష్యత్‌లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీ మొహుద్దీన్ వలి బాబు తదితరులు పాల్గొన్నారు

నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన 4 మోటారు సైకిళ్లు, 6 ఆటోలను పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కన్ఫిస్కేషన్ అథారిటీ ఉత్తర్వుల మేరకు గురజాల ఎస్‌డీపీవో ఆధ్వర్యంలో ఈ నెల 9న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకొని వేలంలో పాల్గొనాలని ఎస్ఐ సూచించారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

మాదిగ ఉద్యోగుల సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగూరి

పిడుగురాళ్ల: మాదిగల ఆత్మగౌరవంగా నిర్వహించే విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్ కుమార్ మాదిగ అన్నారు. పట్టణంలోని బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మాదిగ విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను గురజాల నియోజకర్గం నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్, కుక్కమూడి సుందరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు చల్లగుండ్ల స్వామి, మందా జాషువా, దేవరకొండ సుశీల, మీసాల బాబు, రామా ఇస్రాయేలు, కోటేశ్వరి, జి.కరుణాకర్ తదితరులు ఉన్నారు.

దేవాలయంలో కానుకలు చోరీ

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆలయ పూజారి పరిమి లక్ష్మీనారాయణ ఆలయానికి తాళాలు వేసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చి చూడగా దేవస్థానం ఆవరణలో ఉన్న హుండీ మాయమైనట్లు గుర్తించాడు. కమిటీ సభ్యులు, పోలీసు లకు సమాచారమిచ్చారు. నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కమిటీ సభ్యులు పరిసరాలను పరిశీలించగా దేవాలయం సమీపంలోని పంట పొలాల్లో పగలగొట్టిన ఖాళీ హుండీ పడి ఉండటం గుర్తించారు.

ఆరు వసంతాల ... ఉక్కు సంకల్పం

- ప్రజలకు చేరువ చేసిన ప్రజాసంకల్ప యాత్ర
- ప్రజాసంకల్ప యాత్రకు ఆరు వసంతాలు



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు ఆరు సంవత్సరాలు పూర్తి అయ్యింది.. ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి .. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు .. వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.. రైతులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాలను కలుస్తూ.. వారి సమస్యలను అధ్యయనం చేస్తూ .. తాను అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి కృషి చేస్తానంటూ ముందుకు సాగారు వైఎస్ జగన్ .. ప్రజా సంకల్ప పాదయాత్ర .. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని తెచ్చిపెట్టడంలో కీలక భూమిక పోషించిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో పలు చోట్ల దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా పక్కాల సూరిబాబు మాట్లాడుతూ ఉక్కు సంకల్పంతో ప్రజాసంకల్ప పాదయాత్ర చేసిన వైఎస్ జగన్‌చరిత్ర సృష్టించాడన్నారు. అలాంటి పాదయాత్ర ఇవాళ్టికి ఆరేళ్లు పూర్తి చేసుకుందని.. ఈ రోజును రాష్ట్ర వ్యాప్తంగా పండుగలా జరుపుకుంటున్నామన్నారు. ఈ పాదయాత్రలోనే నవరత్నాలకు బీజం పడిందని, ఆ పథకాల సంకల్పయాత్రతో అధికారంలోకి రాగలిగామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ, రూరల్ మండల పార్టీల అధ్యక్షులు షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పల్నాడు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జానీ, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు తదితరులు ఉన్నారు.

జననేత ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు

నకరికల్లు: ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని వాటిని నెరవేరుస్తున్న జననేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి నేటితో ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నకరికల్లులో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, గుండ్లపల్లి ఉప సర్పంచ్ జూపల్లి మోషే, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, సలీల్, మొగిలి నారాయణ, నాగేల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో పార్టీ జెండాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బాలింత మహిళలకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ముప్పాళ్ళలో వేడుకలు..

ముప్పాళ్ళ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వేడుకలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద, చాగంటివారిపాలెంలోను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, వనమాల బ్రహ్మారెడ్డి, సర్పంచ్ సతీష్, మాజీ సర్పంచ్ ఎం.రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, చక్కెర లక్ష్మీరెడ్డి, పీలా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకే మా మద్దతు

రాజుపాలెం: ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాట నేరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ,సర్పంచ్ పులిబండ్ల అశోక్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ఆర్ ఆర్ సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద జగనన్న సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు నిండిన సందర్భంగా కేక్‌ను కట్‌చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ పులిబండ్ల అశోక్ మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం కష్టపడే జగనన్నకు మద్దతు తెలపాలని కోరారు. అదే విధంగా రెడ్డిగూడెంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌కే బాషా ఆధ్వర్యంలో వైఎస్సార్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఆర్‌బీకే సలహామండలి చైర్మన్ కేదారి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి కోటేశ్వరరావు, దియ్యా చిన్నకొండయ్య, మెరుగు లక్ష్మణ్, గల్లా ప్రభాకర్‌రావు, దియ్యా పెద్దకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో ఎస్ఆర్‌కేహెచ్ విద్యార్థుల ప్రతిభ

అమరావతి: ఈ నెల ఐదవ తేదీన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాప్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన 22వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో విజేతలు ఎస్.గోపి, కె.అజయ్, టి.నరసింహ, వి.జాన్, పి.బాబు, డి.వెంకటేశ్వర్లును అభినందించంచారు. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగతంగానే కాకుండా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో కూడా తృతీయస్థానం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

రేపటి విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం యువజన విద్యార్థి సంఘాల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 32 మంది విద్యార్థులు, యువకుల ప్రాణత్యాగం, అనేక మంది రైతులు తక్కువ ధరకే భూమిని అందించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తుంటే రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు చూస్తూ కూర్చోవటం బాధాకరమన్నారు. 8న జరగనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌లో విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొనాలని, ప్రజలు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజ్ కమార్, సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి సాయికుమార్

జీవన నైపుణ్యాలపై బాలలకు శిక్షణ

గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్ ఆధ్వర్యంలో

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల బాలలకు సోమవారం అమరావతి, గుడ్‌షెపర్డ్స్ పాఠశాలల ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ సిస్టర్ డయానా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు మాట్లాడుతూ బాలలకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. బాలలు సమయానుకూలంగా ఆలోచనావిధానం మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ధైర్యంగా ఉండాలన్నారు, కొత్త శోధనలతో ముందుకుసాగాలన్నారు. సిస్టర్ డయానా మాట్లాడుతూ బాలలు ఎదుటి వ్యక్తికి సహాయం చేయాలన్న ఆలోచనతో ఉండాలన్నారు. రిసోర్సుపర్సన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలలకు ఆలోచన స్కిల్స్, సోషల్, ఎమోషనల్ స్కిల్స్ ప్రధానంగా తెలిసి ఉండాలన్నారు. బాలలు కొత్తగా ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్క బాలలు జాలి, దయ, భరోసా చిన్ననాటి నుంచి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చిల్కాబాబూరావు, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ దిలీప్‌కుమార్

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడిగా గోపి ప్రసన్నకుమార్



సత్తెనపల్లి: విశ్వబ్రాహ్మణ యువజన సంఘ పట్టణ అధ్యక్షుడిగా కోటగిరి గోపి ప్రసన్నకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ నూతన కమిటీతో పాటు యువజన సంఘ అధ్యక్షుడిని పట్టణంలోని వేద కళాశాలలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గోపి ప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. పట్టణ నూతన కార్యవర్గం, యువజన సంఘ కార్యవర్గం ప్రమాణ స్వీకారం డిసెంబర్ 10వ తేదీ నిర్వహించబడుతుందన్నారు.

26న రజక ఆత్మగౌరవ మహాసభ

గురజాల : ఈనెల 26వ తేదీన గుంటూరులో రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజక ఆత్మగౌరవ మహాసభ నిర్వహించడం జరుగుతుందని రజక సంఘం నాయకులు ఆత్మకూరి అలేఖ్య, కన్నారపు శ్రీను, కోయా పుల్లారావులు తెలిపారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వారు మాట్లాడుతూ గుంటూరులోని వీరనారి చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో లక్ష మందితో రజక ఆత్మగౌరవ మహాసభ జరుగుతుందని రజక సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జిల్లా ఖోఖో జట్టుకు ఒప్పిచర్ల విద్యార్థిని

కారెంపూడి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 బాలికల ఖోఖో జట్టుకు మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ మహీ మున్నీసా ఎంపికై నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం విజయ లలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో మహీ మున్నీసా జిల్లా జట్టులో ఆడనుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళగిరి మండలం నిడమర్రులో జరిగిన జిల్లా ఖోఖో జట్ల ఎంపికలో మహీ మున్నీసా ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైందని హెచ్‌ఎం పేర్కొన్నారు. పాఠశాల ఖోఖో జట్టుకు శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ చిన రత్తయ్యకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ఆరోగ్యం దెబ్బతిన్న వ్యక్తి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నరసరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి (35) పదమూడేళ్ళ క్రిందట గణపవరం గ్రామానికి చెందిన షేక్ మీరాబీతో వివాహమైంది. ఏడేళ్ళ నుంచి గణపవరంలోనే నివాసం ఉంటు ఇనుప బీరువాలు, తాళాలు మరమ్మతులు చేస్తున్నాడు. సుమారు నెల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అవయవాలు పనిచేక ఇంటికే పరిమితమయ్యాడు. మద్యానికి బానిసైన మస్తాన్‌వలి గత నెల 29న రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తిన్నాడు. బంధువులు గమనించి నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్య మీరాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మాచవరం: అక్రమంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సమీర్ బాషా తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని రేగులగడ్డ గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించగా, గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,450 నగదును స్వాధీనం చేసుకొని, నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు సమీపంలో కృష్ణా నదిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం ప్రాజెక్టుకు 300 మీటర్ల దూరంలోని శివాలయం వద్ద లభ్యమైనట్లు అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు గ్రామానికి చెందిన యాంపాంగు సందీప్(19) తన స్నేహితులతో వచ్చి ప్రాజెక్టు సమీపంలోని పుష్కరఘాట్ వద్ద స్నానం చేస్తూ ఆదివారం సాయంత్రం కృష్ణానదిలో గల్లంతైన విషయం విదితమే. తన సిబ్బంది సహాయంతో సోమవారం ఉదయం పడవల ద్వారా ఈతగాళ్ల కృష్ణానదిలో గాలించగా గల్లంతైన సందీప్ మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోయినట్లుగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.



సందీప్ మృతదేహం

9 నుంచి ‘ వై ఏపీ నీడ్స్ జగన్ ’ ప్రారంభం

- ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరిద్దాం
- వైఎస్సార్ సీపీ సైన్యం సర్వ సన్నద్ధం కావాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ గ్రామాలకు వెళ్లి గత నాలుగున్నరేళ్లుగా ప్రజలకు పారదర్శకంగా అందించిన సంక్షేమాభివృద్ధిపై అవగాహన కల్పించి, ప్రజల మనసులను గెలిచి ... ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలో వారికి తెలియజెప్పడమే మన అందరి ప్రధాన బాధ్యత అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం జరిగిన ‘ వై ఏపీ నీడ్స్ జగన్ ’ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీన నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 4 గ్రామాలు, పట్టణంలో ఒక సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలో, ఆయన వస్తే సంక్షేమం ఎలా మళ్లీ కొనసాగిస్తారో ప్రజలకు మనం తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ప్రజల్లో జగన్ పట్ల స్పష్టమైన అవగాహన, ఆదరణ ఉందని దాన్ని మనం చైతన్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏ పార్టీకి లేని సైన్యం మనకు ఉందన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ప్రకటించిన షెడ్యూల్ వారీగా కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించి, ప్రదర్శించి లబ్ధిదారులకు వివరిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానికులతో మమేకమవడం, భోజనాలు, రాత్రి బస ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సోషల్ మీడియా సభ్యులది ఇందులో కీలకమైన పాత్ర అన్నారు. వాస్తవాలనే తెలియ చెప్పాలని వక్రీకరించాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, పల్నాడు జిల్లా వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తంరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యులు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లు కొణతం స్వాతి, బొంతు వెంకటరామిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా బాధ్యులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

కౌన్సిలర్లు సెగ్గెం పద్మావతి, తోట సుధారాణి

సత్తెనపల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మొదలుపెట్టారని 17, 18 వార్డుల కౌన్సిలర్లు సెగ్గెం పద్మావతి, తోట వెంకట సుధారాణి అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 17, 18 వార్డుల ప్రజలకు శాలివాహన నగర్ ఎంపీపీఎస్ పాఠశాల నందు సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఇంటి ముంగిటకే వైద్య సేవలను ప్రభుత్వం చేరువ చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య నిర్ధారణ పరీక్షలను చేయించుకొని అవసరమైన మందులు పొందాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఎం.అనూష, డాక్టర్ జి.ధర్మసింగ్‌శాస్త్రి, డాక్టర్ నయోమి సురేఖ, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, డాక్టర్ పి.సుబ్బారావులు 531 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 207 మందికి రక్త శాతం, 246 మందికి ర్యాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలను నిర్వహించారు. ముగ్గురికి మలేరియా, 10 మందికి ఈసీజీ, ఒకరికి టీబీ పరీక్షలను నిర్వహించారు. అదనపు వైద్య పరీక్షలు నిమిత్తం 20 మందిని రిఫర్ చేశారు. 80 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 60 మందికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కళ్ళజోళ్ళు అందించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సత్తెమ్మతల్లి ఆలయంలో చోరీకి యత్నం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని సత్తెమ్మతల్లి ఆలయంలో కానుకల హుండీని దొంగిలించేందుకు ప్రయత్నించిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు స్కూటీపై వచ్చి గ్రామంలోని సత్తెమ్మతల్లి ఆలయం తలుపులు పగులగొట్టి ఆలయం లోనికి ప్రవేశించారు. ఆలయంలో ఉన్న కానుకల హుండీని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పక్కనే మరో ఆలయంలో నిద్రిస్తున్న అయ్యప్ప మాలధారులు గమనించి వెంటబడ్డారు. దీంతో ముగ్గురు ఆగంతకులు ద్విచక్రవాహనాన్ని, వారి చేతిలోని హుండీని అక్కడే వదిలేసి పరారైనట్లు ఆలయ పూజారి తిమ్మనపల్లి జగన్నాథం తెలిపారు. ఆగంతకులు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిశోర్‌బాబు తెలిపారు.



చోరీకి ప్రయత్నించిన ఆలయం (ఇన్‌సెట్) ఆగంతకులు వదిలివేసిన హుండీ

11 సంవత్సరాలుగా అయ్యప్పలకు సద్ది



సద్ది కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు

క్రోసూరు: మండల కేంద్రం క్రోసూరులో అయ్యప్ప సేవా సమితి గత 11 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారులకు సద్దిసేవలు అందిస్తున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మాలలు ధరించి అయ్యప్ప స్మరణతో 41 రోజుల పాటు కఠోర దీక్షలు చేస్తుంటారు. నియమాలను అనుసరించి కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్పస్వామి మాల వేసుకుంటారు. కఠినమైన నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగిస్తారు. అయ్యప్ప మాలధారులకు సద్ది (మధ్యాహ్నభోజనం) ప్రతి ఏటా ఉచితంగా దాతల సహాయ సహకారాలతో అందిస్తున్న అయ్యప్ప సేవా సమితి సేవలు క్రోసూరు గ్రామంలో నిర్వహించటం మాలధారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి రోజు సుమారు 100 నుంచి 120 మంది సద్దికి హాజరవుతుంటారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసరావుపేట బ్రాంచి వారు ది.21/09/2023న పెనుకొండ శ్రీమన్నారాయణమూర్తిగారి కుమారుడు పెనుకొండ గురవయ్య గారికి సంబంధించిన ప్రకటనలో హద్దులు తూర్పు: వెలిశెట్టి వెంకయ్య ఇల్లు 14.1 అ॥లు, దక్షిణం: మలిరెడ్డి సూర్యనారాయణ ఇల్లు అ॥లు గా చదువుకోగలరు

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ

న్యాయవాదులు, ఏవిరెను, రమేంద్రనగర్, గుంటూరు.

9030595227, 9848052914